సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం ♦ 16 ♦ ఫిబ్రవరి ♦ 2024



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శివయ్య అన్నారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వర్ణపుష్పార్చనను నిర్వహించారు.



తొలి పొద్దుపొడుపులో..

సాక్షి,పాడేరు: వంజంగి హిల్స్‌లో గురువారం సూర్యోదయం సమయంలో ప్రకృతి అందాలు కనువిందు చేశాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల నియామకం

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. ఈమేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర న్యాయ విభాగ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.కాళిదాస్‌రెడ్డి (విశాఖ), రాష్ట్ర అధికార ప్రతినిధిగా పాకా సత్యనారాయణ (విశాఖ), సెక్రెటరీలుగా జి.రోశిరెడ్డి (విశాఖ), మోస్య బుజ్జిబాబు (అల్లూరి), వి.శ్రీనివాసరావు (విశాఖ), యర్రా శ్రీనివాసరావు (అనకాపల్లి), జాయింట్ సెక్రెటరీలుగా గండేపల్లి త్రినాథ్‌మూర్తి (విశాఖ), గాలి రామిరెడ్డి (విశాఖ), పంపన సత్యబాబు (అనకాపల్లి) నియమితులయ్యారు. రాష్ట్ర ఎస్టీ సెల్ విభాగం ప్రెసిడెంట్‌గా మత్స్యరాస వెంకటలక్ష్మి (అల్లూరి), జోనల్ ఇన్‌చార్జి కిముడు శ్రీనివాస విశ్వప్రసాద్ నాయుడు (అల్లూరి), సెక్రెటరీలుగా ఎన్.ఆనందబాబు (విశాఖ), గోవర్ధన్ గిరి (అనకాపల్లి), అసిర గోవింద్ (అనకాపల్లి), పండా రామకృష్ణ దొర (అల్లూరి), కిముడు త్రిమూర్తుల దొర (అనకాపల్లి), గబ్బాడి సన్యాసిదొర (అల్లూరి), వంతల బాబూరావు (అల్లూరి), జాయింట్ సెక్రెటరీలుగా జన్ని నరసింహమూర్తి (అల్లూరి), కిముడు శివ లక్ష్మి (అనకాపల్లి), మజ్జి జయవర్ధిని (అల్లూరి)లను, కురుడుబోయిన గంగరాజు (అల్లూరి), కూడా సురేష్‌కుమార్ (అల్లూరి), కిల్లు కోటిబాబు (అల్లూరి)లను నియమించారు. రాష్ట్ర వైఎస్సార్ సేవాదళ్ విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీలుగా గవర నాయుడు (విశాఖ), కుడినోయిన గంగరాజు (అల్లూరి), రాష్ట్ర సాంస్కృతిక విభాగ కమిటీ సెక్రెటరీలుగా బొండాడ వెంకట రమణ (విశాఖ), శోభ ధర్మయ్యదొర (అల్లూరి), సంపంగి శ్రీనివాసరావు (విశాఖ), జాయింట్ సెక్రెటరీగా కొండపు జగదీశ్వరరావు(విశాఖ)లు నియమితులయ్యారు.

ఏరియా ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స చేస్తున్న డాక్టర్ సుధాకర్

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించడంలో వైద్య బృందం నిరంతరం శ్రమిస్తూ విజయం సాధిస్తోంది. గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి ఆధ్వర్యంలో ఆర్థో సర్జన్ డాక్టర్ సుధాకర్ క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. స్థానిక వాటర్ ట్యాంక్ వీధికి చెందిన ముర్ల పోసిరత్నం (32) బైక్ ప్రమాదంలో ఎడమ చెయ్యి హ్యూమరస్ ఎముక ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది.అత్యవసర వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి తీసుకురావడంతో డాక్టర్ సుధాకర్, మత్తు డాక్టర్ మేరీ రోహిణిలు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఆర్థోపెడిక్‌కి సంబంధించి అత్యవసర వైద్య సేవలు ఏరియా ఆస్పత్రిలో విజయవంతంగా అందిస్తున్నట్టు చెప్పారు.

గిరిజన యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ



గిరిజన యువతకు లెర్నర్ లైసెన్సులను అందజేస్తున్న ఎంవీఐ ఆనందరావు

చింతూరు: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం చింతూరులో రవాణాశాఖ, పోలీసులు, సీఆర్పీఎఫ్ అధికారులు గిరిజన యువతకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పులి ఆనందరావు మాట్లాడుతూ ఎంపిక చేసిన గిరిజన యువతకు డ్రైవింగ్‌లో మెలకువలతో కూడిన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. డ్రైవింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని, వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని సూచించారు. రహదారిపై ప్రయాణించే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని ఆయన తెలిపారు. గిరిజన యువతకు డ్రైవింగు లైసెన్సులు ఇవ్వడంలో భాగంగా లెర్నర్ టెస్టు రాయించి. పాసైన వారికి లెర్నర్ లైసెన్సులను అందజేశారు.

గిరిజన గూడేల్లో సాంకేతిక విప్లవం



చిత్రంలో కనిపిస్తున్న గ్రామం చింతూరు మండలం చదలవాడ పంచాయతీ పరిధిలోని తులసిపాక. ఈ గ్రామం దాటాక ఘాట్‌రోడ్ ఉంటుంది. గతంలో ఘాట్‌రోడ్‌లో ప్రమాదాలు జరిగితే అటు మారేడుమిల్లి లేదా ఇటు చింతూరు వస్తేగానీ ప్రమాద వార్త తెలిసేది కాదు. దీంతో వైద్యం ఆలస్యమై పలువురి ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఈ గ్రామంలో ప్రభుత్వ చొరవతో రెండు సెల్‌టవర్లు ఏర్పాటయ్యాయి. దీంతో సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఘాట్‌రోడ్‌లో ఏమైనా ప్రమాదాలు జరిగితే అతిత్వరగా సమాచారం అందుబాటులోకి వస్తోంది.

- మారుమూల గ్రామాల్లో సెల్‌టవర్ల ఏర్పాటు
- అడవి బిడ్డలకు చేరువైన సాంకేతిక సేవలు
- అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగం

నాడు: జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సమాచార వ్యవస్థ అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. సెల్‌ఫోన్ మాట్లాడాలంటే దూరంలోని సిగ్నల్ ఉన్న ప్రాంతాలకు వెళ్లవలసి వచ్చేది. గ్రామ సచివాలయ సేవలు అందుబాటులోకి వచ్చాక ప్రభుత్వ పథకాల్లో భాగంగా పింఛన్ల పంపిణీ కోసం వేలిముద్రలు, ఈకేవైసీ వంటి వాటికి గ్రామస్తులను ఎత్తైన కొండలు ఎక్కించాల్సిన దుస్థితి ఉండేది. విలీన మండలాల్లో వరదల సమయంలో సరైన సమాచార వ్యవస్థ లేక అధికారులతో పాటు ముంపు బాధితులు అనేక ఇబ్బందులు పడేవారు.



గతంలో చింతూరు మండలం సూరకుంటలో సెల్ సిగ్నల్ లేక ఎత్తైన కొండపైకి ఎక్కి వేలిముద్ర వేయిస్తున్న వలంటీరు(ఫైల్)

నేడు: ప్రస్తుతం మారుమూల గ్రామాల్లో సైతం సెల్‌టవర్లు ఏర్పాటవుతున్నాయి. దీంతో ఇప్పుడు తమ ఇళ్లలోనే ఉండి సెల్‌ఫోన్‌లో దూరప్రాంతాల్లో ఉంటున్న బంధువులతో మాట్లాడే అవకాశం ఏర్పడింది. నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాల కోసం ఊళ్లోనే సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు కలిగింది. ఇంటర్‌నెట్ ద్వారా గ్రామ సచివాలయాల్లో నిరంతరంగా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్సు సేవలు వినియోగించుకునే అవకాశం లభించింది. గ్రామంలో ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే అధికారులకు ఫోన్‌ద్వారా తెలిపే అవకాశం అందుబాటులోకి వచ్చింది.



చింతూరు మండలం అల్లిగూడెంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న వృద్ధురాలు

చింతూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తూ గిరిజన పక్షపాతిగా పేరు సంపాదించుకున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా మారుమూల గ్రామాల్లో సమాచార వ్యవస్థ మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా కొత్తగా ఏర్పడిన అల్లూరి జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో కొత్త సెల్‌టవర్ల ఏర్పాటు చేస్తూ సమాచార వ్యవస్థను మెరుగుపరుస్తోంది. గత పాలకులు గిరిజన ప్రాంతాల పట్ల నిర్లక్ష్యం వహించడంతో గిరిబిడ్డలు సమాచార వ్యవస్థకు దూరమయ్యారు. దీంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో నేడు వారికి ఆ పరిస్థితులు దూరమై, అరచేతిలో సెల్‌ఫోన్ ప్రత్యక్షమై బాహ్య ప్రపంచాన్ని క్షుణ్ణంగా తెలుసుకుంటున్నారు.

జిల్లాలో సెల్‌టవర్ల వివరాలు

ఒక్కో టవరును రూ.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇలా 2,061 టవర్లను నిర్మించేందుకు కార్యచరణ రూపొందించారు. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ 62, జియో 73 కలిపి మొత్తం 135 సెల్ టవర్లు ఉండగా, కొత్తగా 2,061 టవర్లు మంజూరయ్యాయి. వీటిలో 1,311 బీఎస్ఎన్ఎల్, 651 జియో, 99 ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ టవర్లు. మొదటి విడతగా గత ఏడాది జూన్ 14న ముఖ్యమంత్రి 100 సెల్‌టవర్లను ప్రారంభించగా, ఈ ఏడాది జనవరి 26న 278 సెల్‌టవర్లను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. అన్ని మండలాల్లో టవర్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మిగతా టవర్ల నిర్మాణం కూడా పూర్తయితే జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తాయి.

మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థ

గతంలో సెల్‌టవర్ల ద్వారా 2జీ, 3జీ సేవలు మాత్రమే అందుబాటులో ఉండగా తాజాగా మెరుగైన కమ్యూనికేషన్ వ్యవస్థతో ఏర్పాటు చేస్తున్న టవర్ల ద్వారా 4జీ, 5జీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో నిర్దిష్టంగా వాయిస్ కాల్స్‌తో పాటు క్షణాల వ్యవధిలో ఇంటర్‌నెట్ సేవలు అందుతున్నాయి. సమాచార వ్యవస్థలో వచ్చిన మార్పుతో ప్రస్తుతం మారుమూల గిరిజన గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి.



ఈ చిత్రంలో సెల్‌ఫోన్‌లో తన బంధువులతో మాట్లాడుతున్న గిరిజన యువతి చింతూరు మండలం పేగకు చెందిన సోడె రాజేశ్వరి. గతంలో సెల్ సిగ్నల్ కోసం ఏడు కిలోమీటర్ల దూరంలోని ఏడుగురాళ్లపల్లి వచ్చి మాట్లాడాల్సిన పరిస్థితి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన పేగలో ఇటీవల ప్రభుత్వం సెల్‌టవర్ ఏర్పాటు చేయడంతో ఆ గ్రామస్తులకు సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దీంతో సిగ్నల్ సమస్యలు తొలగి ఏ సమాచారం తెలియజేయాలన్నా వీలవుతోంది. నిరుద్యోగులు సెలఫోన్ ద్వారా ఇంటర్‌నెట్ వినియోగిస్తూ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక తమకు సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చి తమ బతుకులు మారాయని పలు గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

సివిల్స్‌కు ఎంతో దోహదం



ప్రస్తుతం నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. మా గ్రామంలో సెల్‌సిగ్నల్స్ లేక చాలా ఇబ్బంది పడేవాడిని. ఇటీవలే మా గ్రామంలో టవర్ ఏర్పాటు చేయడంతో సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చి నా చదువుకు ఎంతో దోహదపడుతోంది.

– సోడె శరత్‌బాబు, పేగ, చింతూరు మండలం

గతంలో ఇబ్బందులు పడేవాళ్లం



గతంలో సెల్‌సిగ్నల్స్ లేక ఎన్నో సాంకేతిక సమస్యలు ఎదుర్కొన్నాం. అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మా గ్రామానికి సెల్‌టవర్ వచ్చింది. దీంతో మా ఇబ్బందులు తొలిగాయి.

– మడకం రవి, పేగ, చింతూరు మండలం

సమాచార వ్యవస్థ బలోపేతం



గిరిజన గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమాచార వ్యవస్థ బలోపేతానికి ఎనలేని చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మారుమూల గ్రామాల్లో సైతం సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఆఫ్‌లైన్ ద్వారా అందే సేవలన్నీ సెల్‌టవర్ల ఏర్పాటుతో ఆన్‌లైన్ ద్వారా అందుతున్నాయి.

– నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్యే, రంపచోడవరం

సమాచార వ్యవస్థ మెరుగుపడుతోంది



జిల్లాలో 2024 చివరి నాటికి అన్ని సెల్‌టవర్లు ప్రారంభించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. సమాచార వ్యవస్థ మెరుగుతో గిరిజనులకు ఎంతోమేలు చేకూరడంతో పాటు గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఆన్‌లైన్ సేవలు మారుమూల గిరిజనులకు అందుబాటులోకి వస్తాయి.

– సుమిత్‌కుమార్, కలెక్టర్

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ సుమిత్ కుమార్

హుకుంపేట: గ్రంథాలయాలను యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. నీతి ఆయోగ్ నిధులు రూ.5.50లక్షలతో స్థానిక గ్రంథాలయంలో అభివృద్ధి పనులు నిర్వహించారు. విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులను ఏర్పాటు చేశారు. వీటిని కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్ది, డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారని, వీటిని గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ బదిలీపై వెళుతుండడంతో స్థానిక అధికారులు, విలేకరులు, నాయకులు వీడ్కోలు తెలుపుతూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో వెంకటరావు, సీడీపీవో బాలచంద్రమణిదేవి, ఇంజినీరింగ్ అధికారి ధృవకుమార్, స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, గ్రంథాలయ అధికారి మానస పాల్గొన్నారు.



హుకుంపేట గ్రంథాలయంలో డిజిటల్ బోర్డ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి



పెదబయలులో హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీ



గూడూరు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న డీడీ అబ్బలోం

జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ

పెదబయలు: టెన్త్ పరీక్షల్లో జిల్లాలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని, 10/10 గ్రేడ్ మార్కులు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లావిద్యాశాఖాధికారి బ్రహ్మాజీ ఆదేశించారు. మండలంలో అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానఉపాధ్యాయులతో పెదబయలులో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలని, ఫేషియల్ హాజరు తప్పనిసరి అని చెప్పారు. విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని రకాల ఆన్‌లైన్ యాప్‌లపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండి, సకాలంలో అప్‌లోడ్ చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అందించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యం చేసిన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్టీ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడి అవగాహన కల్పించారు. విద్యార్థులను ఎ,బి,సి,డి గ్రేడ్స్‌గా విభజించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పారావునాయుడు, ఎంఈవో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో...

చింతూరు: ఆశ్రమ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అబ్బలోం ఆదేశించారు. ఆయన గురువారం చింతూరు మండలం తులసిపాక, గూడూరు, బొడ్డుగూడెం, విద్యానగరం, ఏడుగురాళ్లపల్లి, ఎటపాక మండలం నల్లకుంట, కేఎస్‌పురం ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా మెనూ అమలు చేయాలని, వంటలు రుచికరంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన ఎటపాక మండలం కేఎస్‌పురం ఆశ్రమ పాఠశాలలో రాత్రి నిద్రచేశారు.

స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతి ఫైనల్ లిస్ట్ సిద్ధం

- 17న ఐటీడీఏలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్

పాడేరు : స్థానిక ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు ఫైనల్ సీనియర్ లిస్ట్ సిద్ధమైందని, ఆ జాబితాను పాఠశాలల హెచ్‌ఎంలకు పంపించామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోన్నతులు పొందేందుకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాల్సి ఉందన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

నేటి 'స్పందన' రద్దు

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించవలసిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిపాలన పరమైన కారణాలతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని, ప్రజలు గమనించాలని కోరారు. అర్జీలు అందజేసేందుకు పాడేరు ఐటీడీఏకు ఎవరూ రావద్దని ఆయన సూచించారు.

మిశ్రమ చేపల పెంపకంపై శిక్షణ

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20 నుంచి ఐదు రోజుల పాటు మిశ్రమ చేపల పెంపకంపై శిక్షణఇవ్వనున్నట్టు కేవీకే మత్స్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.వీరాంజనేయులు తెలిపారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.శిక్షణ కోసం మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9553364265 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కుక్కల దాడిలో గాయపడిన జింక మృతి

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేటలో కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన 3 నెలల వయస్సు గల చుక్కల జింక చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. రక్షిత అటవీప్రాంతాన్ని వీడి బుధవారం గ్రామానికి వచ్చిన జింకను స్థానికులు కుక్కలబారి నుంచి కాపాడి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చిన సంగతి విదితమే. కాగా ఆ జింకను స్థానిక అటవీక్షేత్ర కార్యాలయానికి తరలించి చికిత్స అందజేసి సపర్యలు చేసినా ప్రయోజనం లేకపోయిందని స్థానిక ఎఫ్ఎస్‌వో రాము తెలిపారు. వై.రామవరం నుంచి వచ్చిన వెటర్నరీ డాక్టర్ వీరేంద్ర జింకకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు సమక్షంలో స్థానిక సిబ్బంది జింకను దహనం చేశారు.



మృతి చెందిన చుక్కల జింక

క్లుప్తంగా

మంత్రి అమర్‌నాథ్‌కు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అభినందనలు



మంత్రి అమర్‌నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.అరకు పార్లమెంట్ పరిధిలో ఇటీవల తన పర్యటన వివరాలను మంత్రికి సమగ్రంగా వివరించారు. చింతపల్లి ఎంపీపీ కోరాబు అనుషాదేవి ఉన్నారు.

జలకళ తప్పుతున్న మత్స్యగెడ్డ



అడుగంటుతున్న మత్స్యగెడ్డ..

ముంచంగిపుట్టు: నిత్యం నీటితో కళకళలాడే మత్స్యగెడ్డ అప్పుడే అడుగంటుతోంది. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు జలాశయం మత్స్యగెడ్డ నీటి నిల్వపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఎండలకు అడుగంటుతూ జల కళ తప్పింది. సుజనకోట,పెదగూడ,దార్రెల,పనసపుట్టు,దొడిపుట్టు పంచాయతీల మీదుగా మత్స్యగెడ్డ ప్రవహిస్తుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీటి గండం తప్పదని స్థానికులు తెలిపారు.

శారదాపీఠంలో ఆధ్యాత్మిక సౌరభం

ఘనంగా ప్రారంభమైన వార్షికోత్సవాలు



మేధా దక్షిణామూర్తికి పూజలు చేస్తున్న స్వామీజీలు



భక్తులకు ఆశీస్సులు అందిస్తున్న స్వామీజీ



గాత్ర కచేరీలో పాల్గొన్న కళాకారులు

పెందుర్తి: జగన్మాత శారదా సన్నిధిలో ఆధ్యాత్మికత పరవళ్లు తొక్కుతోంది. వేదఘోషతో సాగరతీరం పరవశిస్తోంది. పెందుర్తి మండలం చినముషిడివాడలోని శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గురువారం యజ్ఞయాగాదులు దిగ్విజయంగా జరిగాయి. వైదిక ఆచారాల మధ్య గణపతి పూజతో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ పీఠం అనుష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి, మేధాదక్షిణా మూర్తికి ప్రత్యేక పూజలు ఆచరించారు. గోమాతకు పూజ చేసి నైవేద్యం అందించారు. జమ్మిచెట్టు ప్రదక్షిణ చేశారు. అనంతరం పారాయణ మహాయజ్ఞంలో భాగంగా భక్త బృందాలు, భజన మండళ్ల కనకధార స్తోత్రాన్ని పారాయణ చేశాయి. ఐదు రోజుల పాటు జరిగే మహారుద్ర సహిత రాజశ్యామల యాగాన్ని పండితోత్తముల సమక్షంలో అగ్నిమథనం చేసి ప్రారంభించారు. ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ లక్ష్మి గణపతి, దక్షిణామూర్తి హోమాలు చేపట్టారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సామూహిక గాత్ర కచేరీ చేపట్టారు. కళాకారులు ఉత్సాహంగా భక్తి గీతాలను ఆలపించారు.

నేడు శ్రీశైలం దేవస్థానం సారథ్యంలో మల్లికార్జున కల్యాణం

పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం సారథ్యంలో శుక్రవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఈ వేడుక శాస్త్రోక్తంగా ప్రారంభమవుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస కల్యాణం, ఆదివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

ఉన్నత చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి

అరకులోయ రూరల్: విద్యార్థిని కిల్లో వసంత మృతి దురదృష్టకరమని ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి తెలిపారు, మండల కేంద్రం కంఠభంసుగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు, పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినులతో మాట్లాడి జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈనెల 13న పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కిల్లో వసంత మృతికి గల కారణలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యార్థులపై పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. క్షణిక వేశంలో విద్యార్థినులు ఇటువంటి సంఘటలకు గురికావడం బాధకరమన్నారు. విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదిగి తల్లిదండ్రులు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం మృతి చెందిన వసంత స్వగ్రామమైన ఒంబిలో సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అవసరమైన నిత్యావసర సరకులు అందజేశారు. నాయకులు రాందాసు, హరి పాల్గొన్నారు.

సూక్ష్మలిపిలో సూర్యష్టకం



చిన్నసైజులో రవికుమార్ రాసిన సూర్యష్టకం, తదితర పుస్తకాలు

మాకవరపాలెం: రథసప్తమిని పురస్కరించుకుని మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ సూర్యష్టకం, సూర్య ప్రార్థన, సూర్య అష్టోత్తర శతనామావళి, ఆదిత్య హృదయం, ఆదిత్య అష్టోత్తర శతనామావళిలను సూక్ష్మలిపిలో రాశారు. శుక్రవారం సూర్యజయంతి సందర్భంగా వీటిని రాసినట్లు తెలిపారు. 2 సెంటీమీటర్ల సైజులో సూర్యప్రార్థనను 9 పేజీలు, సూర్య అష్టోత్తర శతనామావళి పది పేజీలు, ఆదిత్య హృదయం 11 పేజీలు, ఆదిత్య అష్టోత్తర శతనామావళిని 12 పేజీల్లోనూ రవికుమార్ సూక్ష్మలిపిలో రాశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతి అందజేస్తున్న రంపచోడవరం ఏఎస్పీ జగదీష్

వై.రామవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లీ చెప్పారు. మన ఊరు మన పోలీసు, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలో జంగాలతోటలో మెగా వాలీబాల్ టోర్నీ, ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధిలో తాము పాలు పంచుకుంటున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. యువతకు డ్రైవింగ్ శిక్షణ, డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు చేయించడం, ఉద్యోగాల కల్పన వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. టోర్నీలో విన్నర్స్ టి.యర్రగొండ టీమ్‌కు రూ.10వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన యర్రంరెడ్డిపాలెం టీమ్‌కు రూ.8వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జంగాలతోట టీమ్ రూ.5 వేలు , షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, అడిషనల్ ఎస్పీ ఓఎస్‌డీ మహేశ్వర రెడ్డి, ఆదేశాల మేరకు ఈకార్యక్రమా లు నిర్వహించారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, అడ్డతీగల సీఐ రవికుమార్, సిఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ సీఐ వెంకటరమణ, ఎస్ఐలు సంతోష్ కుమార్, సాయికుమార్, రాంబాబు పాల్గొన్నారు.

బోడి దొరకు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



బోడి దొరను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట : స్వాతంత్ర్య సమరయోధుడు మల్లుదొర మనవడు బోడి దొరను విశాఖ కేజీహెచ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు శాసన సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం పరామర్శించారు. మోతాదుకు మించి బీపీ మాత్రలు వాడడంతో అనారోగ్యానికి గురైన బోడి దొరను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చారు. ఆయనను భాగ్యలక్ష్మి, సుభద్ర పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయనకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకూ పరామర్శ..

చింతపల్లి మండలం మారుమూల గ్రామాలైన సంపంగిపుట్టు– వేమనపల్లి మధ్యలో సోమవారం రాత్రి జీపు అదుపుతప్పి బోల్తాపడ్డ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వంచల దుర్గానికి చెందిన బోనంకి భవానిని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ చైర్‌పర్శన్ జల్లిపల్లి సుభద్ర పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇదే క్రమంలో జి.మాడుగుల మండలం కులవరపాడుకు చెందిన కొర్ర చిట్టిబాబు ఇటీవల హైవే నిర్మాణ పనుల సందర్భంగా చెట్టు తనపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అతన్ని కూడా భాగ్యలక్ష్మి, సుభద్ర పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ప్రమాద బాధితులకు పరామర్శ



కేజీహెచ్‌లో జీపు ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

మహారాణిపేట (విశాఖ దక్షిణం): చింతపల్లి మండలం మారుమూల సంపంగిపుట్టు వేమనపల్లి రహదారిపై జీపు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో గాయపాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి గురువారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న చింతపల్లి మండలం వంచులదుర్గానికి చెందిన బోనంగి భవాని ఆరోగ్యపరిస్థితిపై కేజీహెచ్ సూపరింటెండెంటతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. హైవే నిర్మాణ పనుల్లో ఉండగా చెట్టు కూలి గాయాలపాలైన మరో క్షతగాత్రుడు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జి.మాడుగుల మండలం కులపాడు గ్రామానికి చెందిన కొర్ర చిట్టిబాబును ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలన్నారు.

వన్‌ధన్ వికాస కేంద్రాలతో ఉపాధి అవకాశాలు మెరుగు



వేములోవలో వన్‌ధన్ వికాస కేంద్ర సభ్యులతో సమావేశమైన జీసీసీ ఎండీ సురేష్ కుమార్

గంగవరం/ దేవీపట్నం : వనధన్ వికాస కేంద్రాలతో గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని, గిరిజనులు సేకరించిన జీడిమామిడి, మామిడి, తేనె, నల్ల జీడి పిక్కలు తదితర అటవీ ఉత్పత్తులకు మార్కెంటింగ్ సదుపాయం కల్పించేందుకు జీసీసీ కృషి చేస్తోందని జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో గంగవరం, దేవీపట్నం మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. గంగవరం మండలంలో గంగవరం, పిడత మామిడి, జగ్గంపాలెం, దేవీపట్నం మండలంలోని పెదభీంపల్లి, పోతుకొండ గ్రామాల్లో వన్‌ధన్ వికాస కేంద్రాల సభ్యులతో ఆయన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ, జీసీసీ అందించే సహకారం గురించి కేంద్రాల సభ్యులకు వివరించారు. జీడిమామిడి పిక్కలు, జొన్నలు తదితరాలను గిరిజన వీడీవీకే సభ్యులు ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన యంత్రాలను సమకూర్చనున్నట్లు చెప్పారు. అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, జీసీసీ మార్కెటింగ్ సెక్షన్ అధికారులు ఆర్.వి.రమణమూర్తి, ఫిరోజ్, జీసీసీ సీనియర్ మేనేజర్ యం.వి.ఎన్ రాజారెడ్డి, వెలుగు అధికారి రామరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



గాదిగుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు


జి.మాడుగుల: టీడీపీలో బలంగా ఉన్న గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు పాతి ఆ టీడీపీని మట్టి కరిపించడమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నాయని వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గం సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. మండలంలో నుర్మతి పంచాయతీ గాదిగుంట గ్రామంలో టీడీపీ నాయకులు గ్రామపెద్ద వంతాల నూకరాజు, మాజీ వార్డు సభ్యుడు వంతాల నాగేశ్వరరావు, గ్రామస్తులు భాస్కరరావు, వెంకటరావు, రామలింగం శ్రీను, అజిత్, మల్లేశ్వరరావు, శివరావు, కళ్యాణ్ తదితర 50కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ వైఎస్సార్‌సీపీ కండువాలను వేసి విశ్వేశ్వరరాజు పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి, సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన వంటి పార్టీలు మట్టికరిస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన చూసి టీడీపీ కంచుకోటలుగా ఉన్న గ్రామాల్లోని ప్రజలు వందలు, వేలల్లో నేడు వైఎస్సార్‌సీపీలోని చేరుతున్నారన్నారు. టీడీపీ ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరడాన్ని, జగనన్న పాలనపై వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు విమర్శలు చేస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ,సర్పంచ్ సీదరి కొండబాబు, మాజీ జిల్లా కార్యదర్శి కూడా సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు అంద్రయ్య, రామకృష్ణ, నాయకులు పండన్న, లక్ష్మణపడాల్ ,రమణ, సోమలింగం, చిన్నబాబు ఆచారి, వలసయ్య, ప్రశాంత్, బాలయ్యపడాల్, సోంబాబు, వైస్ సర్పంచ్ మురళి, బాలన్న, శేఖర్, లక్ష్మినాయుడు, బాలన్న, శ్రీను, పోతురాజు, అబ్బాయిదొర, భాస్కర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెదబయలు: జిల్లాలో ఉపాధి కూలీలకు పనుల కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శివయ్య అన్నారు. మండల కేంద్రంలో ఉపాధి పనులపై మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన 946 పనులకు రూ.23,75,57,620 నిధుల ఖర్చుకు సంబంధించి గురువారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఉపాధి కూలీలకు 100 రోజులు పని దినాలు కల్పించడం లేదని, అలాగే మస్తర్లు లేకుండా, వర్క్ ఆర్డర్ లేకుండా పనులు చేయడం.ఏడు రకాల రికార్డులు నిర్వహణ లేకపోవడం, జాబ్ కార్డులు అప్‌డెట్ చేయకపోవడం, పని జరిగిన ప్రదేశాల్లో బోర్డులు లేకపోవడం, చనిపోయిన వారి పేరుతోనే వేతనాలు చెల్లింపులు చేయడాన్ని గుర్తించారు. దీనికి సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని బాధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏ ఇతర సిబ్బందికి రికవరీ రాశారు. ప్రతీ వేతనదారుడికి వంద రోజుల పని కల్పించడం, సకాలంలో కూలీలకు వేతనాలు అందించమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్లాంటేషన్ పనులు చేసిన చనిపోయిన మొక్కల ప్రదేశంలో వేరే మొక్కలు నాటించాలని ఆదేశించారు. అలాగే పంచాయతీ గ్రామ సభలో పనులు గుర్తించుకోవాలన్నారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెండ్

మండలంలోని వనభంగి పంచాయతిలో ఉపాధి కూలీలకు 100 రోజులు పనులు కల్పించని ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు జి.కొండలరావు, పి.సుహాసినిను డ్వామా పీడీ శివయ్య సస్పెండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సీతగుంట పంచాయతీలో నెల రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు చేయించాలన్నారు. ఉపాధి ఏపీడీ గిరిబాబు. జిల్లా విజిలెన్స్ అధికారి సీహెచ్.నిర్మల దేవి, సహాయ విజిలెన్స్ అధికారి వై.వెంకటేశ్వర రావు, ఎంపీడీవో విగ్గిస్స్, వైస్ ఎంపీపీలు పాంగి సోనె, కొర్ర రాజుబాబు, ఏపీవో పెదప్పల నాయుడు, పూర్వపు ఏపీవో మూర్తి, సామాజిక తనిఖీ డీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా

మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యం

- కిల్కారీ వాయిస్ కాల్స్ సేవలతో వారి ఆరోగ్యానికి భద్రత
- డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా

పాడేరు: మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పాడేరు డివిజన్ ఆశా నోడల్ పర్సన్స్‌కు కిల్కారీ సేవలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై ఎప్పటికప్పుడు వాయిస్ కాల్స్ అందించేందుకు కిల్కారీ మొబైల్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. గర్భిణుల వివరాలను స్థానిక ఏఎన్ఎం నమోదు చేసుకునేటప్పుడు పేర్కొన్న మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారీ సేవల ద్వారా ఫోన్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణులు తమకు వచ్చే ప్రతి సందేశాన్ని నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. మహిళ గర్భం దాల్చిన నాల్గవ నెల నుంచి కాన్పు జరిగి, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్ సందేశాలు వచ్చేలా కిల్కారీ సేవలను డిజైన్ చేశారన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి 01244588000 నంబర్ నుంచి కాల్స్ వస్తాయన్నారు. మళ్లీ ఆ సందేశం వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కిల్కారీ సేవల స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు, డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ మోహన్‌రావు, డీపీహెచ్ఎన్‌వో భూలోకమ్మ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీ లించిన పిదప ప్రతిస్పందించాల్సిం దిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.